185) ముఖారి

ప॥ ఇదియే బుద్ధి నాకు నింతకంటే మఱి లేదు । కదిసి నీబంటనంటే కాతువు నన్నును ॥

చ॥ నేరిచి నడచేనంటే నే గాను స్వతంత్రుడను । నేరమి చేసేనంటే నిండును దూరు ।
యీరెంటికి గాక నేను యిట్టె నీకు శరణంటే । గారవించి వహించుక కాతువు నన్నును ॥

చ॥ వొక్కచో నర్థ మార్జించుకుండితే జన్మాలు పెక్కు । యెక్కేనంటే మోక్షము యేడో యెఱుగ ।
యెక్కడిసుద్దులునేల యిచ్చట నీనామము । గక్కన బేర్కొంటే దయ గాతువుగా నన్నును ॥

చ॥ తపసినయ్యేనంటే జితము కైవశము గాదు । చపలసంసారి నైతే శాంతి యుండదు ।
ఉపమలేల శ్రీవేంకటోత్తమ నీసేవ చేసి । కపటము మానితేను కాతువు నన్నును ॥